# అమ్మాయి ప్రయాణం

సమ్మెట విజయ సౌజన్య



"అదిగో స్టేషన్ వచ్చేసింది! తాతయ్యా! తాతయ్యా! స్టేషనే కదూ!"-గోలగోలగా అరుపులు వినిపించడంతో స్టేషన్ వైపుకి తొంగి చూడడానికి ప్రయత్నించి,ముందున్న బుజ్జిగాడు అడ్డంగా నిలబడడంతో విసుగ్గా వంగి మరీచూసింది అమ్మాయి.

ఇంతలో రైల్వేస్టేషన్ రానే వచ్చింది. ఆటో యెక్కిన సంబరమంతా పోయింది. అయినా స్టేషన్ రాకతో క్రొత్త ఉత్సాహం తెచ్చుకుని బుజ్జిగాడు దిగగానే ఛంగున దూకిందమ్మాయి.

"ఈడొచ్చిన పిల్లవి ఎగుర్తావా?"- అంటూ ఖయ్యి మన్నాడు తాతయ్య.

నీ ప్రశ్నలోనే ఉంది తాతయ్యా సమాధానం - అందా మనుకుని మళ్ళీ సంభాషణ సాగించడం యిష్టంలేక గబగబా రెండు బ్యాగులు అందుకుంది అమ్మాయి. లేకపోతే ఎక్కడ ఆ మూట బెడ్డింగు పట్టుకోమంటారోనని. అంతా తలా రెండు పట్టుకుని బుకింగ్ దాకా వచ్చారు. అక్కడ ఓ పొడుగాటి 'క్యూ' దర్శన మిచ్చింది. ట్రైన్ రావడానికి ఇంకా అరగంట టైమున్నా ఆ క్యూ మాత్రం ఇప్పుడప్పుడే తరిగేట్టులేదు.

సగటు తాతగారు చూసారు. లాభం లేదనుకున్నారు. భార్యామణి సరోజినమ్మని ఆడవాళ్ళ క్యూ తక్కువగా ఉందని టికెట్స్ తెమ్మన్నారు తాతయ్య. ఆవిడది భారీకాయం. ఆ జనంలో నావల్ల కాదందామె. పిల్లలిద్దరూ చిన్నవారు కావడంతో వాళ్ళు తేలేరని పించింది తాతయ్యకి.

చివరికి ఈడొచ్చిన అమ్మాయి లాభం లేదనుకుని తాతయ్యని "పోనీ నేను తేనా తాతయ్యా?" అంది. తాతయ్య తన కళ్ళద్దాల్లోంచి ఓ సారి ఆడవాళ్ళక్యూ వంకా, మరోసారి మగవాళ్ళక్యూ-వంకా చూసి తన గడియారంతో బేరీజు వేసుకుని తప్పదని అమ్మాయి చేతిలో డబ్బులు పెట్టాడు.

"హమ్మయ్య!"- అమ్మాయి అనుకుంది. అమ్మాయికి చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. ఈ ప్రయాణాన్ని మాగ్జిమమ్ ఎంజాయ్ చేద్దామనే అన్నయ్య సంతానమైన ఇద్దరు పిల్లల్తో, తాతయ్య, నాన్నమ్మలతో ప్రయాణం కట్టింది!

చకచక నడిచి ఆడవాళ్ళ క్యూలో నిలుచుంది. ఓ సారి తన పమిట సర్దుకుంది. మరోసారి జుట్టుని పైకినెట్టి పిన్నులాగి తలకు పోసుకున్న ఆ కురులు తిరిగి ముఖంమీదకు జారకుండా గట్టిగా పెట్టు కుంది.

క్యూ నత్తనడక నడుస్తుంది. ఈ లోగా క్యూలోని ఆడవాళ్ళ వైపు చూసింది అమ్మాయి. నడి వయసు వాళ్ళు అయిదుగురు కొంచం అటుఇటుగా ఉన్న స్త్రీలు కొందరు, కొందరు చంకలో పిల్లో, పిల్లాడో ఉన్నవాళ్ళు, ఒకరిద్దరు మరీ పెద్దవయసువారు ఉన్నారు. ఒకామె తనంత వయసే ఉన్నా ఉట్టి పల్లెటూరిపిల్ల. చీర కట్టుకున్నా నల్లగా మోటుగా ఉంది. ఎటొచ్చి కాస్త లేతవయస్సులో పరికిణీ పావడా వేసుకున్నది, కాస్త ఎట్రాక్టివ్‌గా ఉన్నది తనొక్కతే నన్నమాట! అనుకుంది అమ్మాయి. అప్రయత్నంగా చేతులు పమిటను సర్దు కున్నాయి. క్యూ మరికాస్త కదిలింది.

కౌంటర్‌లో ఇద్దరు మగవాళ్ళకి, ఒక స్త్రీకి చొప్పున టికెట్సి యిస్తున్నారు. తన ప్రక్కన ఉన్న మగవాళ్ళ క్యూవైపు చూసిందో సారి అమ్మాయి. ఒక స్టూడెంటులా కనిపించే యువకుడు దీక్షగా అమ్మాయివైపే చూడటంతో అమ్మాయి లోలోపలి 'అహం' గర్వంతో పొంగిపోయింది. ఒక నడివయసాయన మింగేసేలా చూడ్డంతో భయం కూడా వేసిందమ్మాయికి. మిగిలిన వారంతా అమ్మాయితండ్రిలా ఉన్న వారే (వయసులో). క్యూకదిలింది. తనవంతు టికెట్టు తీసుకుని అక్కడే ఆగిపోయిన యిందాకటి యువకుడ్ని వెనుక వాళ్లు "జరగ వయ్యా జరుగు" అంటూ కసురుకోవడంతో అతగాడు సదరు లైట్ బ్లూకలర్ షర్ట్అబ్బాయి అమ్మాయి కేసిచూసి వెళ్ళలేక వెళ్లలేక వెళ్ళిపోయాడు.

"అత్తా మరే ప్రక్కకి నిలబడమన్నాడు తాతయ్య!" అంటూ బుజ్జిగాడు కొంగు లాగుతూ చేయిపట్టుకుంటే స్పృహలోకి వచ్చిందాన్లా

యిటు తిరిగి బుజ్జిగాడి మాటలకి మండిపోయి "సర్లే నువ్వు వెళ్లు" అని వాడ్ని కసిరిపంపి ఎలాగో టికెట్స్‌తెచ్చింది అమ్మాయి.

ట్రైన్ స్టేషన్‌లోకి వచ్చింది. తాతయ్య, నానమ్మ హడావుడిగా ట్రైన్ ఎక్కడ వెళ్ళిపోతుందోననే కంగారులో ఏ కంపార్ట్‌మెంటో కూడా చూడకుండా ఒకటే పరుగు పెడ్తున్నారు.

"పదండ్రా! ఓసే మంగతాయీ పదవే!" అనడంతో వాళ్ళ మీద అమ్మాయికి పిచ్చికోపమొచ్చేసింది. అంత హడావుడిలోనూ "లక్షాతొంభై ఒక్కటోసారి" ఆ పేరు తనకి పెట్టినందుకు తిట్టుకుంది పెట్టిన వాళ్ళని. పోనీ ముద్దుగా మంగా అని పిలవమంటే వినరు. పోనీ కనీసం 'మంగతాయారూ' అని పిలిచేడవండంటే అదీ వినరు. ఏంటి తాయీ అట తాయి! - కసిగా అనుకుంది అమ్మాయి. ఆ విసుగులో సరిగా వాళ్ళని చేరుకోలేక ఆయాసంతో ఆగిపోయింది. వెనక్కి తిరిగి చూసిన నానమ్మ, తాతయ్య, పిల్లలు తిరిగి వెనక్కు వచ్చేసారు- అమ్మాయి కదలక పోవడంతో !

అమ్మాయి కసురుకుంది "ఏమిటి తాతయ్యా అట్లా పరుగు పెడ్తావ్! ఎందులోనో ఓడాంట్లో ఎక్కక! అయినా ఇదిక్కడ అర గంట ఆగుతుంది తెలుసా?" అంది.

"ఈ వెతుకులాటలో అదెళ్ళిపోతుందిగానీ పదపద" అన్నాడు తాతయ్య.

నడవక తప్పలేదమ్మాయికి. చివరి కంపార్టుమెంట్ వచ్చింది. అది జనరల్ కంపార్టుమెంటు. వాళ్ళు ఎక్కవలసిందదే. జనంతో కిట కిటలాడుతుంది. తాతయ్య, నానమ్మ, పిల్లలు అందులోకి ఏక్కుతుంటే అమ్మాయి గత్యంతరంలేక ఎక్కింది. కానీ మనస్సులోమాత్రం ఛీ తను ప్రయాణమంటే ఏమనుకుంది? ఎంచక్కా "మల్లెలు - మంచు పూలు" నవల్లో తన అభిమాన రచయిత్రి వ్రాసినట్లుగా. అందులో హీరోయిన్ తనలాగే పరికిణీ పావడా వేసుకుంటుంది. తనువేసుకున్న గులాబీరంగు దుస్తులే వేసుకుంటుంది. తనంత అందంగా ఉంటుంది.

"ఓసేవ్ తాయీ ! నిన్నేనే ఆ సామాన్లు తీసుకురా !"— అన్న కేకతో తేరుకుని గబగబా సామాన్లు అందించింది. కాస్త ఫ్రీగా నిలబడడానికి చోటు దొరికింది సామాన్లు పైన పెట్టడంతో. నాన్నమ్మ భారీ కాయం కాస్తా ఎదురుగా కూర్చున్న ఓ ముసలాయన ప్రక్కన ఉన్న కాస్త జాగాలో సర్దుకుంది. పిల్లలు కిటికీల దగ్గర నిలబడి తల బయటకు పెట్టి చూస్తున్నారు. తాతయ్య పరుగువల్ల వచ్చిన ఆయాసం తీర్చుకుంటున్నాడు. తాతయ్య ప్రక్కనే నిలబడిందమ్మాయి.

కిటికీలోంచి బయటకు చూడాలనే అమ్మాయి ప్రయత్నానికి ఒక కిటికీలో బుజ్జిగాడు మరొక కిటికీలో చిన్నిగాడు అడ్డంగా కన్పిం చారు. దాంతో ఈ వైపు లాభం లేదనుకున్న అమ్మాయి ఆ వైపు కిటికీలోంచి చూద్దామనుకునే సరికి కిటికీ దగ్గర కూర్చున్న ఒక వ్యక్తి నల్లగా, భయంకరంగా కనిపించాడు. చూడ్డానికి అతగాడు కుర్రాడి లాగే ఉన్నా అమ్మాయి కోరుకునే అందానికి భిన్నంగా ఉండడంతో అతడ్ని అంత భయంకరంగా ఊహించుకుంది అమ్మాయి. ఇంక ఆ వైపుకి తల తిప్పకూడదనుకుంది అమ్మాయి.

కంపార్ట్‌మెంట్‌లో ఎవరెవరున్నారా అని చూసింది అమ్మాయి. ఒకరిద్దరు తప్ప అంతా పిల్లాజెల్లల్తో, మూటా ముల్లెలతో ఉన్నవాళ్లే నలుగురయిదుగురు ఉద్యోగాలు చేసేవారు. ఇద్దరు ముగ్గురు ఒంటరిగా ప్రయాణించే ఒంటరివాళ్ళు కనిపించారు అమ్మాయికి. ఈలోగా ట్రైన్ కదిలింది. అంటే అలా ట్రైన్ కదిలిందో లేదో నాన్నమ్మ ఒక కేక పెట్టింది. ఏదో పరధ్యానంలో ఉండడంతో నాన్నమ్మ ఎందు కలా అరిచిందో అర్థం కాలేదు అమ్మాయికి కానీ నవ్వుకుంటూ బుజ్జి గాడు, చిన్నిగాడు చేతులు, తల లోపలికి తీసుకోవడంతో నాన్నమ్మ పెట్టిన కేక వాళ్ళని లోపలికి తలపెట్టుకోమని అని అర్థమైంది నాన్నమ్మ అరుపుకి - సిగ్గుతో ఎవరైనా చూసారేమోనని అటూ యిటూ చూసింది. అందరూ ఎవరిగోలలో వాళ్ళుండడంతో కాస్త తేరు కుంది. వెనుకకు తిరిగి అటువైపు ఎవరున్నారా అని కుతూహలంగా చూసింది అమ్మాయి. అంతే ! టక్కున నిలిచిపోయాయి అమ్మాయి చూపులు. అతను.... అతను.... యిందాక కౌంటర్‌లో అమ్మాయికేసి చూసిన లైట్‌బ్లూకలర్ షర్ట్ వేసుకున్న అబ్బాయి.

"అబ్బ అచ్చం హీరోలా ఉన్నాడు."-అనుకుంది అమ్మాయి.

"అత్తా ! అత్తా !" అన్న కేకతో తల యిటు తిప్పింది అమ్మాయి విసుగ్గా.

"అదిగో చూడత్తా" అంటూ ఏదో చూపిస్తున్నాడు చిన్నిగాడు ఒళ్ళు మండి పోయిందమ్మాయికి. యింత చిన్న వయస్సులో ఉన్న తనను అత్తా అత్తా" అంటూ పిలవడం ఎంత మాత్రమూ నచ్చలేదు అమ్మాయికి. కానీ ఎంత చెప్పినా "అత్తా" అనే పిలవడంతో ప్రతీ సారీ ఇలా ఒళ్ళుమండి తర్వాత ఆ మంటలు ఆరిపోయి మామూలుగా అయిపోతుందమ్మాయి.

"ఆ.... బాగానే ఉన్నాయి" అంది చివరికి సమాధానంగా మళ్ళీ ఒకసారి అతని వైపుకి చూడగానే తన అభిమాన రచయిత్రి నవల గుర్తుకు వచ్చింది అమ్మాయికి. అంటే తల మామూలుగా తిప్పి సుదీర్ఘంగా ఆ నవల్లోని హీరో, హీరోయిన్‌లను తలుచుకుంది. ఇప్పుడు అమ్మాయి పూర్తిగా నవల్లో లీనమయి దానిలోని కొన్ని సీన్స్‌ని గుర్తుకు తెచ్చుకుంటుంది.

నవల్లో ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో కిటికీ ప్రక్కన హీరోయిన్ పల్లవి కూర్చుంటుంది. చేతిలో వీక్లీ. ఎదురుగా హీరోగారు బెర్త్ మీద

నుంచి పల్లవిని చూపుల్తో తింటుంటాడు. హీరో చూపులు తింటుంటే ఓ సారి అలవోకగా చూసి సరిగ్గా తింటున్నాడో లేదో చూస్తుంది పల్లవి. ఆమె చూపుకి జన్మ ధన్యమైనట్లుగా భావించేస్తాడు హీరో. అసలు హీరోయిన్ ఒక్కతే ఎలా ప్రయాణం చేస్తుందో! హీరో ఒక్కడే అదీ ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంటులోకి ఎలా వస్తాడో అక్కడ రచయిత్రి చెప్పలేదు. కనుక యిక్కడ అమ్మాయి అది ఆలోచించ లేదు. (సో మనం కూడా ప్రస్తావించ కూడదు !)

అమ్మాయి ఆ తర్వాత హీరో ప్రవీణ్, పల్లవిని పలకరించడం, ఆ తర్వాత వాళ్ళిద్దరి డైలాగ్స్ అన్నీ మననం చేసుకుంటుంది. అవన్నీ ఈ క్షణం ఎవరన్నా చెప్పమంటే తడుముకోకుండా చెప్ప గలదు అమ్మాయి. అలా వాళ్ళిద్దరి అరగంట డైలాగుల తర్వాత (25 పేజీల తర్వాతన్నమాట) హీరో ప్రవీణ్ బెర్త్‌దిగి పల్లవిని ముద్దుపెట్టుకుంటాడు! గంటలోనే అంత చనువు ఎలా వచ్చిందనేది అక్కడ రచయిత్రి రాయలేదు. అమ్మాయికి తట్టలేదు. (కనుక మనకి తట్టకూడదు. ఊరికినే చదివేసి ఎక్సైట్ అయిపోవాలంతే !)

"ఒసేవ్ తాయీ ! పలకవేమే ? యివిగో నాలుగు బఠానీలు నువ్వు నములు—" అంటూ అమ్మాయి చేయి పట్టి లాగింది నాన్నమ్మ. అందమైన నవలాలోకంలో విహరిస్తుంటే వెధవ బఠానీలు చెడగొట్టాయనుకొని విసుగ్గా చూసింది నాన్నమ్మవైపు, ఆమె చేతిలోని బఠానీల వైపు. అంతలోనే నవల్లో పల్లవి చక్కగా ఫ్లాస్కులోని కాఫీ సిప్ చేయడం తలుచుకుని "ఛీ ఛీ నాకొద్దు" అంది అమ్మాయి.

"అదేమిటే నచ్చకపోతే వద్దను అంతే కానీ ఛీఛీ ఏమిటే ఛీ ఛీ?" అంటూ నాన్నమ్మ చేయి వెనక్కి తీసుకుంది.

"నాన్నమ్మా నాకిచ్చేయ్" అని బుజ్జిగాడు "నాకూ" అంటూ చిన్నిగాడు ఎగబడ్డారు ఆ బఠానీల కోసం.

"ఛీఛీ నాన్‌సెన్స్" అనుకుంది అమ్మాయి. ప్రక్కన చూస్తే తాతయ్య లేడు. ప్రక్కనున్న మనిషి ప్రక్క కూర్చొని బుజంమీదుగా వరుగుతూ నిద్రలోకి జారుకున్నాడు !

బుజ్జిగాడు, చిన్నిగాడు తలోప్రక్కనా యిరికారు. అయితే తనేనా కూర్చోనిది! లేదు లేదు.... ఈసారి ఆలోచనలు కట్టిపెట్టి ఎలా అయినా సీటు సంపాదించాలి - అనుకుంది గట్టిగా, తలతిప్పి చూసింది. ఏదోస్టేషన్ వస్తున్నట్లుంది. ఇటువైపు సరిగా కనిపించడం లేదని అటువైపు ఎర్రకళ్ళ మనిషి సంగతి మరిచిపోయి చూసింది. కానీ ఎర్రకళ్ళ మనిషి- అమ్మాయిని ఉద్దేశించి తన సీట్లో కూర్చోమని తను బెర్త్‌పైకి (నిద్రొస్తుందేమో పాపం!) ఎక్కేసాడు. ఎవరూ ఆ కిటికీ వైపుకి చేరకముందే రెండు గెంతుల్లో కిటికీ ప్రక్కన లక్కీగా సెటిలయిందమ్మాయి. మనసులోనే ఎర్రకళ్ళ కుర్రాడికి దణ్ణం పెట్టేసుకుంది. అతని విషయానికొస్తే మనిషి భయంకరంగా ఉన్నా ప్రవర్తన ఎందుకు భయంకరంగా లేదో అర్థం కాలేదు అమ్మాయికి. సీట్ దొరికిన సంతోషంలో తను గెంతినందుకుగాను ఈ సారి నాన్నమ్మ సణుగుళ్ళు విన్పించ లేదమ్మాయికి.

"హమ్మయ్య!" అనుకొని హాయిగా తల వెనుకకు ఆనించి కిటికీలోంచి మనసారా బయటకి చూసింది అమ్మాయి. తిరిగి లోపలికి చూస్తూ తనహీరో అయిన లైట్‌బ్లూకలర్ షర్టబ్బాయి కనిపించడు కదా అని విచారించింది అమ్మాయి. కానీ అంతా అమ్మాయి లక్కే! ఇందాక అమ్మాయి నిలబడ్డ స్థలంలో అమ్మాయి చదివిన నవల్లో ప్రవీణ్‌లాగా ప్రత్యక్షమయ్యాడు లైట్ బ్లూకలర్ షర్టబ్బాయి ఉరఫ్ అమ్మాయి హీరో. మళ్ళీ నవల్లో లీనమయిందమ్మాయి. ముద్దుపెట్టు కున్న సీన్ తర్వాత పల్లవి ప్రవీణ్ ఎదురెదురుగా కూర్చుని అరగంట సేపు తదేకంగా చూసుకుంటారు. సడన్‌గా దోమకుట్టినట్లుగా పల్లవి బుగ్గలు కందిపోయాయి. అమ్మాయి ఎదురుగా కనిపిస్తున్న లైట్ బ్లూకలర్ షర్ట్ అబ్బాయికేసి అలానే చూసింది. అంతే, అమ్మాయి బుగ్గలు కూడా దోమకుట్టినట్లుగా ఎర్రగా అయిపోయాయి. ఇంతలో ప్రక్కన చేరాడు చిన్నిగాడు. "అత్తా నేనక్కడికి రావద్దా?" అరుస్తు న్నాడు బుజ్జిగాడు. "వద్దువద్దు" కంగారుగా చెప్పిందమ్మాయి. చిన్నిగాడు ఏమీ అడక్కుండానే అమ్మాయి ఒళ్ళో కూర్చున్నాడు. నాన్నమ్మ, తాతయ్య కునుకు తీస్తున్నారు. చిన్నిగాడి తలప్రక్కనుంచి కిటికీలోంచి నవల్లోని పల్లవిని చూసినట్లుగా అలఓకగా కాసేపు ప్రకృతిని చూసిందమ్మాయి. నవల్లో పల్లవికి పచ్చని చేలు పట్టు తివాచీల్లా కన్పిస్తాయి. అమ్మాయికి మాత్రం తుమ్మచెట్లు, ఆ వెనుక బీటలు వారిన భూమి కనిపించాయి. వాటిని ఏమనుకోవాలో తెలీలేదమ్మాయికి. పోనీలే సీజను కాదేమో అనుకుంది. (కానీ నిజానికి కరువువల్ల ఆ యేడు పంటలు పండక భూములలా ఉన్నాయని మన అమ్మాయికి తెలీదు. ఎందుకంటే అమ్మాయి లోకం యిదికాదు కనుక.) క్రమంగా ఇళ్ళు కనిపించాయి. స్టేషన్ ఏదో పెద్దదే వచ్చింది. పదిహేను నిమిషాలదాకా ఆగుతుందేమో! 'ఛాయ్, ఛాయ్,' 'బిస్కెట్, బిస్కెట్స్' మొదలైన కేకలతో అంతా నిద్ర లేచేసారు.

పిల్లలు మరచెంబులో నీళ్ళు ఆఖరుచేసారు. తాతయ్య దిగి నింపి తీసుకొచ్చి తాగమన్నాడు అమ్మాయిని. మరచెంబులో నీళ్ళు తాగాలంటే ఎలాగో అనిపించిందమ్మాయికి. కానీ దాహం వేస్తుంటే ఎవరైనా చూస్తున్నారేమోనని గబగబా తాగేసింది. అందరూ తాగాక వెళ్ళి మళ్ళీ నింపి పెట్టాడు తాతయ్య. దూరంగా లైట్ బ్లూకలర్ షర్ట్ అబ్బాయి జేబులోంచి దువ్వెనతీసి అలవోకగా దువ్వుకుని ఫ్లాట్‌ఫాం మీద ఓ కప్పు టీ తాగి డబ్బులిచ్చాడు. ఇంతలో నలుగరయిదుగురు కుర్రాళ్ళు అమ్మాయి వైపు చూస్తూ- హాయ్‌బ్యూటీ! వండర్‌ఫుల్ ! టాటా!"

అంటూ తిరిగి వెళ్ళారు. వాళ్ళని చూసి తాతయ్య, నాన్నమ్మ తిట్టుకుంటుంటే అమ్మాయికి మాత్రం అలా తిట్టాలనిపించలేదు. ట్రైన్ కదిలింది. కదుల్తున్న రైల్లోకి మెల్లగా ఎక్కాడు లైట్ బ్లూకలర్ షర్ట్ హీరో.

అమ్మాయికి యిప్పటిదాకా ప్రయాణం కొన్ని ఎడ్జెస్ట్‌మెంట్స్‌తో బాగానే ఉన్నా రానురాను మరీ విసుగెత్తి పోయింది. కారణం అమ్మాయి కంటే కాస్త అందంగాఉన్న మరో అమ్మాయి అదే కంపార్ట్‌మెంట్‌లో ఎక్కడం. ఆ కొత్త అమ్మాయి వాళ్ళ నాన్నతో కావచ్చు ఓ సూట్‌కేసుతో ఎక్కింది. యిప్పటి వరకు తన హీరో అనుకున్న లైట్ బ్లూకలర్ షర్టబ్బాయి కాస్తా తనని చూడ్డం మానేసి యిందాక తనని చూసినట్లుగానే ఈ క్రొత్తమ్మాయిని చూడ్డం మొదలుపెట్టాడు.

ఇంతలో "శివ శివశంకర" పాటపాడ్తూ అడుక్కుంటున్నాడు ఒకతను. మరీ పాడేదేదో ఆ పాటలు కాకుండా ఏ 'న్యూ సాంగ్సో' పాడితే బాగుండుననుకుని అదీ ఎంజాయ్ చేయలేక పోయిందమ్మాయి. ఈ హీరో అతడికి నవల్లో హీరోలాగా ఐదురూపాయలు కాకపోయినా ఒక్క రూపాయన్నా వేస్తాడనుకుందమ్మాయి. కానీ ఒక్కనయాపైస (అవిప్పుడు లేవు కనుక ఐదుపైసలన్నా) కూడా వేయలేదు పాపం అమ్మాయిహీరో! తాతయ్య ఓ ఇరవై పైసల బిళ్ళ వేసాడు. హమ్మయ్య ఫరవాలేదనుకుందమ్మాయి.

తను గమనించలేదుగానీ ఎదురుగా ఉన్నశాల్తీ తనకాళ్ళు మెల్ల మెల్లగా అమ్మాయికాళ్ళకి తగిలేలా జరుపుతుండడం గమనించింది అమ్మాయి. పక్కన పెళ్ళాన్ని పెట్టుకుని పాడుబుద్ధులు పుడ్తున్నందుకు వాడ్ని "దొంగవెధవా!" అని తిట్టుకుని కాళ్ళు జరుపుకుంది అమ్మాయి. రాను రాను ట్రైన్ మరీ రద్దీగా తయారయ్యింది. గాలిరాక, ఊపిరాడక, తనేదో నరకంలోకి ప్రవేశించి నట్లుగా తాను పొరపాట్న ఈ మిడిల్ క్లాస్‌లో పుట్టినట్లుగా బాధపడి పోయిందమ్మాయి.

ఎప్పుడెప్పుడు తను దిగాల్సిన స్టేషన్ వస్తుందోననే ఎదురు చూస్తూ గడిపిందమ్మాయి.

మళ్ళీ ఇందాకటి క్రొత్తమ్మాయివైపు చూసిందమ్మాయి. తన హీరో ఆ అమ్మాయిని అనుకుని నిలబడ్డట్టుగా నిలబడ్డాడు పాపం. ఆమె తండ్రీ కూతురితో ఈ వెధవపక్కన నిలబడాల్సి వచ్చింది కదా అన్నట్లుగా బాధగా నిలబడ్డాడు. తనకన్నా అందంగా ఉన్న ఆ అమ్మాయిని చూడగానే ఇందాకట్నుంచీ 'హీరోగా' భావించిన వెధవకి పుట్టిన నీచపుబుద్ధి ఇది అన్నమాట! ఒక వేళ తనే ఆ ప్లేస్‌లో ఉంటే తనూ అలాంటి స్థితిని ఎదుర్కోవాల్సిందే కదా! ఛ తనెంత మానర్‌లెస్‌గా ఆలోచించింది? ఏదో మత్తులోంచి తేరుకుంటున్నట్లుగా సాగుతున్నాయి అమ్మాయి ఆలోచనలు.

"హాయ్‌బ్యూటీ! హలో స్మార్టీ!" అన్న మాటలకి కాస్తవంగి చూసిందమ్మాయి. డోర్ దగ్గర యిందాక తనను అవే మాటలంటే తాను పొంగిపోయిన ఆ కుర్రాళ్ళు నిలబడి క్రొత్త అమ్మాయి కేసి చూస్తూ అవేమాటలంటున్నారు. ఈ సారెందుకో ఆ మాటలు రుచించ లేదమ్మాయికి తల తిప్పడానికి కూడా వీలులేని స్థితిలో ఉన్న కొత్తమ్మాయి తనలా పొంగిపోయి నవ్వుకోకుండా కోపంగా వాళ్ళకేసి చూడగానే ఒకడు కన్ను గీటాడు. కంపరంతో తల దించుకున్న క్రొత్తమ్మాయి కేసి చూసింది అమ్మాయి. తలంతా గిర్రున తిరిగి నట్లయింది ఆలోచనలతో. యిప్పుడు అమ్మాయి ఆలోచనలు నవల్లోకి సాగటం లేదు. ఇందాకట్నుంచి తన ఊహాల్ని ప్రస్తుతం కనిపిస్తున్న వాస్తవంతో విశ్లేషించుకుంది.

"కాస్త జరగవయ్యా, జరుగు" అన్న అరుపులకి ఉలిక్కిపడి అటుకేసి చూసిందమ్మాయి. బెర్త్ మీద పడుకున్న ఎర్రకళ్ళ కుర్రాడు ఎప్పుడు లేచాడో తెలీదు కానీ అరుస్తూ గభాలున దిగి ఇందాక హీరో అనుకున్న రోగ్‌ని యివతలకి లాగాడు. అమ్మాయి వింతగా చూసిందతని వైపు. మరో ప్రక్క తననెక్కడ సీట్‌లోంచి లేచిపొమ్మంటాడో అనికూడా భయపడింది అమ్మాయి. కానీ అమ్మాయి ఊహలకి భిన్నంగా అమ్మాయి నుద్దేశించి "చూడమ్మా మీరు మీరు సర్దుకొని కాస్త ఈమెక్కూడా చోటివ్వండి" అన్నాడు అమ్మాయితో. తల ఊపి తను జరిగి ప్రక్కనామెని జరగమని క్రొత్తమ్మాయికి చోటిచ్చింది. ఇందాకట్నుంచి తనకా ఊహే రానందుకు ఆశ్చర్యపోయింది! కృతజ్ఞతగా చూస్తున్న క్రొత్తమ్మాయిని, ఆమె తండ్రినీ చూసేసరికి ఎందుకో తనెప్పుడూ పొందని అనుభూతి కలిగింది అమ్మాయికి. యిప్పుడు అతడు ఎర్రకళ్ళతో భయంకరంగా అనిపించలేదు అమ్మాయికి చాలా ఉన్నతంగా కనిపించాడు.

దూరంగా తాను దిగాల్సిన స్టేషన్ వస్తుండడంతో సామాన్లు పట్టుకొని రైలు ఆగగానే దిగడానికి సన్నద్ధమవుతూ అతనికేసి చూసింది అమ్మాయి. అతడు స్నేహంగా నవ్వడం, రైలు స్టేషన్‌లో ఆగడం ఒకేసారి జరిగాయి. అమ్మాయి ప్రయాణానికి, ఫుల్‌స్టాప్ పెడ్తూ.